క్లుప్తంగా

రేపు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పై సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే దినేష్ మెడికల్ సెంటర్‌లో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించామని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరామర్శ



కౌన్సిలర్ ఖాజా హుసేన్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కొప్పు ఖాజా హుసేన్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించారు. ఇటీవల గుండె నొప్పి వచ్చి స్టంట్ వేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఖాజాహుసేన్‌ను ఇంటికి వచ్చి ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగిరెడ్డి దంపతులను శుక్రవారం కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించారు. గంగిరెడ్డి ద్విచక్రవాహనంలో ప్రొద్దుటూరుకు వెలుతూ పోట్లదుర్తి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వైసీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి తదితర నాయకులు ఆయన వెంట ఉన్నారు.

రేపు శ్రీసత్యనారాయణస్వామి కల్యాణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం శ్రీలక్ష్మీ, భూలక్ష్మి సమేత శ్రీసత్యనారాయణస్వామి వ్రతం, కల్యానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుగుణాకరరావు తెలిపారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

పులివెందుల అభివృద్ధిపై సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మితో కలిసి పులివెందుల నియోజకవర్గంలోని అన్ని విభాగాల అధికారులతో కలిసి టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పులివెందుల నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యాన రంగాలను పెంపొందించి, వ్యవసాయ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజ్‌లు, పల్ప్ ఇండస్ట్రీల తీసుకువచ్చే విధంగా అందరూ కలిసి కృషి చేద్దామని చర్చించారు. అలాగే రైతులకు మద్దతు ధరలు పెరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఆయా సీజన్లలో పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలని చర్చించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 మోడల్ గురించి, పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించారు.

రస్తా ఆక్రమణ తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

చింతకొమ్మదిన్నె : గ్రామపంచాయతీలోని హోంగార్డు కాలనీ సర్వేనెంబర్ 845 విస్తీర్ణం 4.22 లోని రస్తాను ఆక్రమించి అక్రమంగా రోడ్డుపై నిర్మిస్తున్న రేకుల షెడ్డును తొలగించినట్లు చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

మండల తహసీల్దార్‌గా రెడ్డిలక్ష్మి



వేముల : వేముల తహసీల్దార్‌గా రెడ్డిలక్ష్మి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఇందిరా రాణి పదవీ విరమణ పొందారు. దీంతో పులివెందుల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రెడ్డిలక్ష్మి వేముల తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం ఆమె వేముల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పశువులతో దెబ్బ తింటున్న పంట పొలాలు



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు



పంట పొలాల్లో తిరుగుతున్న గొర్రెలు

మైలవరం : మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో రైతులు, పశువుల కాపరుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఈ ఏడాది గ్రామ కావలిని నియమించలేకపోయారు. తద్వార పశువులను కట్టడి చేసేవారు లేకపోవడంతో అవి పంట పొలాలను నష్టపరుస్తున్నాయి. అధికారులు జోక్యం చేసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సోలార్ దెబ్బతోనే సమస్యల ఉత్పన్నం

వద్దిరాల గ్రామాన్ని అనుకుని దక్షిన దిక్కున ఉన్న దొడియం కొండ ఇటు గొర్రెలకు, మేకలను, ఆవులకు గేదెలకు మేత స్థలంగా ఉండేది. ఈ కొండ ప్రాంతంలో పశువులు తృప్తి తీర మేతవేసి వచ్చేవి. గతేడాది ఈ ప్రాంతానికి సోలార్ రావడం వల్ల సోలార్ కంపెనీలు కొండను పూర్తిగా అక్రమించి పశువులు అడుగులు పెట్టకుండ ముళ్ల తీగలతో కంచెలు వేశారు. దీంతో జీవాలకు మేతలేపోవడంతో కాపరులు ఇతర గ్రామాలకు వెళ్లి గొర్రె, మేకలను మేపుకుంటున్నారు. వాస్తవానికి వద్దిరాల పొలంలోనే మేత మేపుకుంటే అందుకు ప్రతిగా వారు కొంత డబ్బును గ్రామ రాసికి చెల్లించేవారు. ఆ డబ్బులతో గ్రామ పెద్దలు గ్రామ కావలిని ఏర్పాటు చేసుకునేవారు. అయితే ఈ ఏడాది వద్దిరాల గ్రామంలో మేత స్థలం అంతటిని సోలార్‌కంపెనీలు అక్రమించడం, పశువుల కాపరులు మేత కోసం ఇతర గ్రామాలను ఆశ్రయించడంలో వారు ఈ ఏడాది గ్రామ రాసికి డబ్బులు చెల్లించలేదు. ఫలితంగా ఈ ఏడాది గ్రామ కావలి నియామకం జరుగలేదు. దీంతో పశువులు యధేచ్ఛగా పొలాల్లోనికి వెల్లుతున్నాయి.

అధికారులు జోక్యం చేసుకోవాలి

వద్దిరాల గ్రామంలో పశువులకు కట్టడి లేకపోవడంతో అవి పొలాల్లోనికి వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని రైతు సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల ధాటికి దెబ్బతిన్న మొక్కజొన్న పైరును ఆయన చూపించారు. అధికారులు జోక్యం చేసుకుని గ్రామంలో కావలిని నియమించి పశువులను కట్టడి చేయాలని ఆయన కోరారు. పంట వేసుకున్న పొలాలకు భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాసవీమాతకు గోరింటాకు పూజ



గోరింటాకు పూజలో శ్రీవాసవీమాత అమ్మవారు

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం వాసవీమాతకు గోరింటాకు పూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వాసవీమాతకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ మాట్లాడుతూ గోరింటాకు పూజ అంటే సాధారణంగా శుక్రవారం నాడు స్త్రీలు గోరింటాకు పెట్టుకుని, ఆకు పూజించడం ఒక సంప్రదాయమన్నారు. ఇది ఆరోగ్యం, శ్రేయస్సు కోసం, అలాగే ఇంటిలోని ప్రతికూల శక్తులను తొలగించడానికి ఈ పూజ చేస్తారన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ఆలయంలో గర్భగుడి చుట్టూ వాసవీమాత ప్రాకారోత్సవం నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు శ్రీ వాసవీమాత అష్టోత్తరం, శ్రీలక్ష్మీమాత అష్టోత్తరం, శ్రీవెంకటేశ్వర స్వామి అష్టోత్తరం, శ్రీలలితా సహస్రనామం, వారాహి నవరాత్రులలో 9వ రోజు పూజాది కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్‌రావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవీ కల్యాణ మండపం, అవోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి



మినుము పంటను పరిశీలిస్తున్న కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సెంటిస్ట్ డాక్టర్ వీరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని దేవరాజుపల్లె గ్రామంలో సాగులో ఉన్న మినుము పంటను ఆయన పరిశీలించి మట్లాడారు. సాగు భూమి చౌడు బారడం వలన భూమిలోని పోషకాలు మొక్కకు సరైన స్థాయిలో అందక ఎండిపోతున్నాయని వివరించారు. దీని నివారణకు పూత దశకు ముందు 19–19–19 పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. పూత దశలో 13–0–45 లేదా మల్టీకే 10 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మినుము పంటలో వైరస్ తెగులు అధికంగా వ్యాప్తి చెందిందని, పంట దశను బట్టి రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించడానికి 0.4 మి.లీ ఈమిడా క్లోక్రిడ్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే 10 గ్రాముల 13.0.45ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుటకు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున పొలంలో ఉంచాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తదితరులు



సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ మాధవ



వేంపల్లెలో అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

పులివెందుల : దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1,2ల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్రం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయస్సులో ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి, రెండేళ్ల పాటు బ్రిటీషర్లకు కంటిమీద కునుకు లేకుండా చేశాడన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం అసోసియేట్ డీన్ మాధవ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్ర పటం వద్ద పుష్ప నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్య్రం కోసం ఆయన చేసిన పోరాట పటిమ గురించి వివరించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ప్రముఖ స్వాతంత్ర సమరయోధులైన అల్లూరి సీతారామరాజు, డాక్టర్ పింగళి వెంకయ్య స్వాతంత్ర సమరంలో నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ తెలిపారు. వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చరిత్ర శాఖ, తెలుగు శాఖ, రాజనీతి శాస్త్ర విభాగాల నాయకత్వంలో అల్లూరి సీతారామరాజు జయంతి, డాక్టర్ పింగళి వెంకయ్య వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిసి అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య చిత్ర పటాల వద్ద పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యలకు పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.

భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జిల్లా ఉప మాస్ మీడియా అధికారిణి రమణమ్మ

తొండూరు : భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమని, వాటికి పాల్పడిన వారికి చట్టరీత్యా శిక్షార్హులని జిల్లా ఉప మాస్ మీడియా అధికారిణి రమణమ్మ తెలిపారు. శుక్రవారం తొండూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి జిల్లా ఉప మాస్ మీడియా అధికారిణి హాజరై మాట్లాడారు. జిల్లాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉందని, ఇది సమాజ జాడ్యమని, సమాజంలో అసమానతలకు కారణబూతమని, అసాంఘిక కార్యక్రమాలకు ప్రేరణ అన్నారు. ఆడ పిల్లల యొక్క ఆవశ్యకతను గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో రీజినల్ కార్యదర్శి, అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి ఆధ్వర్యంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీడీలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసనతోపాటు ధర్నా నిర్వహించామన్నారు. ప్రభుత్వ పెద్దలు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు కార్మికుల సమస్యలపై శ్రద్ధ చూపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ, ఇవ్వాలని, కొత్తగా వచ్చిన ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగుల సంస్థ ద్వారా నడపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దూరమవుతున్న వైద్య విద్య



మెడికల్ కళాశాల వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు సాయిదత్తా, రామ్‌లక్ష్మణ్‌రెడ్డి

పులివెందుల : కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని, కుట్రలు, కుతంత్రాలకు తక్షణమే స్వస్తి పలకాలని వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు సాయిదత్తా, రామ్‌లక్ష్మణ్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను వైఎస్సార్‌సీపీ యూత్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు నాయకులతో కలిసి సందర్శించి విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ 40 ఏళ్ల ఇండస్ట్రీ కదా.. అందుకే పీపీపీ అని కొత్త పాట పాడటం ప్రారంభించారని, పీపీపీ విధానం అమలు చేయడంవల్ల కొన్ని వందల మంది మెరిట్ విద్యార్థులు ఎంబీబీఎస్‌కు దూరమవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్న మన విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రభుత్వ కళాశాలలను కొనసాగిస్తానని విద్యార్థులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం నారాయణ మెడికల్ కళాశాల వంటి ప్రైవేట్ సంస్థలకు దోచి పెట్టడానికి ఈ పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారని, ఇది అందరికీ తెలుసు అన్నారు. ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా మాకు మెడికల్ సీట్లు కావాలని అడుగుతుంటే, మాకు సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇంతటి సిగ్గు చేటు మరొకటి ఉంటుందా అని వారు ప్రశ్నించారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తే మాత్రం మేం చూస్తూ ఊరుకోమని, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సందీప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు కడప నగర అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి నీలవర్థన్‌రెడ్డి, కోశాధికారి రాఘవేంద్రారెడ్డి, కడప నగర ఉపాధ్యక్షుడు జబ్బార్, విష్ణు, శ్రీకాంత్, రవి, శేఖర్, పవన్, ఉపేంద్ర, నజీర్, మహేష్, చిన్న, తేజ, అప్పస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి



రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు

వల్లూరు : మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వల్లూరులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య భవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన జయంతిని నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సుదీర్ఘకాలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక మంత్రిగా రోశయ్య అందించిన సేవలు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేశాయని సంఘ నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


దోమల నివారణకు చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఎర్రగుడిపల్లెలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య జాతీయ డెంగీ మాసోత్సవం, ఫ్రైడే - డ్రైడే సందర్భంగా దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాలు మురికి కాలువల్లో వేయకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించండి



పల్లెనిద్రలో అవగాహన కల్పిస్తున్న పోలీసు

కొండాపురం : బ్యాంక్‌ల పేర్లు చెప్పి ఓటీపీ చెప్పమని రాంగ్ కాల్స్ చేస్తుంటారని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కానిస్టేబుల్ నాగేంద్ర సూచించారు. శుక్రవారం మండలంలోని కొండాపురం గ్రామంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల అదేశాల మేరకు పోలీస్ కానిస్టేబుల్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించామన్నారు. అలాగే పోక్సో, బాల్య వివాహాలపై యువతకు అవగాహన కల్పించామన్నారు.

ఘనంగా పీర్ల గ్రామోత్సవం



పెద్దపుత్త గ్రామంలో పీర్ల గ్రామోత్సవం

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పీర్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్త, తప్పెట్ల, దిగువపల్లె తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను పట్టుకుని వీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర, పప్పులు, బెల్లంలను ప్రసాదంగా సమర్పించి అందరికీ పంచిపెట్టారు. పీర్ల చావిడి దగ్గర ఫాతెహాలను నిర్వహించారు.

కొలువుదీరిన పీర్లు

సింహాద్రిపురం : సింహాద్రిపురం, గురిజాల, లోమడ, రావులకొలను, బలపనూరు తదితర గ్రామాల్లోని పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అలంకరించి పీర్లను కొలువుదీర్చారు. శుక్రవారం చిన్న సరిగెత్తును పురష్కరించుకుని ఆయా గ్రామాల్లో చావిడిల వద్ద పాతిహాలు నిర్వహించారు. శనివారం పీర్లతో గ్రామాల వీధులలో ఊరేగింపు నిర్వహిస్తారు.

రజకుల సంక్షేమాన్ని మరచిన కూటమి ప్రభుత్వం



రజకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

జమ్మలమడుగు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రజకుల సంక్షేమం పూర్తిగా మరచిపోయిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరులో ఉన్న రజకుల దోభీ ఘాట్‌లో పని చేసుకుంటున్న రజకులతో ఆయన మాట్లాడి సంక్షేమ పథకాల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా రజకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు ఏడాదికి రూ. పదివేలు అందేదని ప్రస్తుతం ఎటువంటి పథకాలు తమకు అందడంలేదన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇస్త్రీ పెట్టే పథకం కింద రజకులకు ప్రతి ఏడాది పదివేల రూపాయలు వారి ఖాతాలో జమచేస్తువచ్చారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం వాటిని అటక ఎక్కించిందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ



ప్రజలతో మాట్లుడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

చింతకొమ్మదిన్నె : పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నియంత్రణ సాధ్యమని ప్రజలు గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఊటుకూరులో జరుగుతున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామంలోని ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి నీటితొట్లు, కుండలు, బానలు శుభ్రం చేసుకోవాలన్నారు. నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంటే దోమలు గుడ్లు పెట్టి ఎక్కువ దోమలు వృద్ధి అవుతాయన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు, నీరు నిలబడకుండా జాగ్రత్తగా వుండాలన్నారు. దోమలు కుట్టకుండా రాత్రి పూట దోమ తెరలు వాడాలని, మురికి కాలువలలో చెత్త వేయవద్దన్నారు. వైద్యులు మానస, మెడికల్ ఆఫీసర్, వెంకటరెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ నాగలక్ష్మి రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత కరువు

వేంపల్లె : కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత కరువైందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు జిల్లా ఉపాధ్యక్షుడు రహంతుల్లాఖాన్ తెలిపారు. శుక్రవారం చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పిల్లల కోసం రోజుకు ఒక రకమైన నాణ్యతతో కూడిన భోజనం ఉండేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హెచ్ఎంకు హామీ ఇచ్చారు.

విద్యార్థులు.. మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు



యాంటీ డ్రగ్స్‌పై ర్యాలీలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

– ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార్ స్వామి గుప్తా

వేంపల్లె: భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు వెళ్లవద్దని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా తెలిపారు. ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామిగుప్తా మాట్లాడుతూ డ్రగ్స్ అనేవి నిదానంగా ప్రాణాలను హరించే మత్తు పదార్థాలు అన్నారు. మత్తును పేరేపించే వ్యక్తుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయరాదన్నారు. ఎలాంటి చెడు అలవాట్లుకు విద్యార్థులు బానిసలు కారాదన్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు అందరూ సే నో టు డ్రగ్స్ – సే ఎస్ టు లైఫ్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, జి.తిరుపతిరెడ్డి, అనిత, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.